క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు విద్యుత్ సబ్‌స్టేషన్ 11 కేవీ నల్ల గేటు ఫీడర్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా మంగళవారం ఉదయం ఎనిమిది నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బి.వి. సుధాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాడింకి వారి స్ట్రీట్, గడియారం వారి వీధి, అబ్బూరు వారి వీధి, లైబ్రరీ వీధి, గిరి వీధి, ఎస్ఆర్‌పీ రోడ్డు, జల్లా వారి వీధి పురుషోత్తం వారి వీధి, ఏకేటీపీ స్కూల్ రోడ్డు, సీబీడీ ఆఫీసు రోడ్డు, స్వరా హాస్పిటల్ ఏరియా, భగత్ సింగ్ రోడ్, దండమూరి రామ్మోహన్‌రావు వీధి, వందనపువారి వీధి, శివాలయం రోడ్డు, శివరావు స్ట్రీట్, బ్రహ్మయ్య పంతులు వీధి, నర్రావారి స్ట్రీట్, గిరీస్ట్రీట్, మానేపల్లి వారి వీధి, లక్ష్మీనగర్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని పేర్కొన్నారు.

సహస్ర రాణికి గోకరాజు అభినందన



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్ర రాష్ట్రం నుంచి తొలి రోయింగ్ ఖేలో ఇండియా క్రీడాకారిణిగా ఎంపికైన రాధా సహస్ర రాణిని మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు సోమవారం అభినందించారు. జనవరి 30–ఫిబ్రవరి 11వ తేదీ వరకు మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో జరగనున్న జూనియర్ ఖేలో ఇండియా యూత్ గేమ్స్ లో పాల్గొనేందుకు ఆమె అర్హత సాధించింది. ఈ సందర్భంగా గోకరాజు గంగరాజు చిన్నారిని ప్రశంసించారు. రాబోయే జాతీయ క్రీడల్లో రాష్ట్రానికి మరిన్ని పతకాలు తీసుకురావాలని ఆకాంక్షించారు. రోయింగ్ ఖేలో ఇండియా సౌత్ జోన్ మెంబర్, స్కల్లింగ్ అండ్ రోయింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ప్రెసిడెంట్ డాక్టర్ తరుణ్ కాకాని, ,కోచ్ వి.వి.రావును గంగరాజు అభినందించారు.

హెల్మెట్ ధరించి ప్రయాణించడంలోనే ఆనందం



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): హెల్మెట్ ధరించి వాహనాలను నడపడం వల్ల అందరూ ఆనందంగా ఉండొచ్చని సింగ్‌నగర్ సీఐ ఎస్‌వీవీఎస్ లక్ష్మీనారాయణ అన్నారు. హెల్మెట్ వాడుకపై ద్విచక్ర వాహనచోదకులకు సింగ్‌నగర్ పైపులరోడ్డు సెంటర్‌లో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాలు అంటేనే చెప్పకుండా వచ్చేవని, బైకులు నడిపే వారు హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించడాన్ని అలవాటుచేసుకోవాలన్నారు. ఎస్సైలు సత్యనారాయణ, శ్రీనివాస్, గోవింద్ పాల్గొన్నారు.

జాతీయ ఆర్చరీ క్రీడాకారిణికి సన్మానం



గుణదల(విజయవాడ తూర్పు): సీబీఎస్‌ఈ స్కూల్ ఆర్చరీ దక్షిణ భారత పోటీల్లో ప్రథమ స్థానం సాధించించిన కె.చంద్రహాసినిని విజయవాడ గుణదలలోని సెయింట్ జాన్స్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ ప్రిన్సిపాల్ కె.రమా భారతి ఘనం సత్కరించారు. ఆమె మాట్లాడుతూ దక్షిణ భారత పోటీల్లో రాణించి జాతీయ పోటీలకు ఎంపికైన చంద్రహాసిని తమ పాఠశాల విద్యార్థిని కావడం సంతోషంగా ఉందన్నారు. భారత జట్టు చెస్ కోచ్ వి.ఆర్.బొబ్బా ఈ కార్యక్రమంలో పాల్గొని చెస్ పోటీల్లో పతకాలు సాధించిన ఎస్.వర్షిత్, జాహ్నప్రణవ్, నిశ్చల్, నందిక, భార్గవిపాల్, రమేష్‌రెడ్డి, భరత్‌ను అభినందించారు.

దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు, డిప్యూటీ మేయర్ శైలజారెడ్డి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశంలోని మరే ఇతర రాష్ట్రాల్లోనూ అమలు కావడం లేదని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పేర్కొన్నారు. 23వ డివిజన్ 93వ వార్డు సచివాలయం పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం జరిగింది. వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి ఆత్మకూరు సుబ్బారావు, కో–ఆర్డినేటర్ ఒగ్గు విక్కీతో కలిసి ఎమ్మెల్యే మల్లాది విష్ణు గడప గడపకూ పర్యటించారు. కోవెలమూడి వారి వీధి, చలసాని వెంకటకృష్ణయ్య వీధి, రామానాయుడు వీధులలో ఇంటింటికీ తిరిగి, స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో సూర్యారావుపేట, గవర్నర్‌పేట ప్రాంతాలు నిర్లక్ష్యానికి గురయ్యాయన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 12 ప్రధాన రహదారుల నిర్మాణాలు చేపట్టి పూర్తి చేయడంతో ఈ ప్రాంత ముఖచిత్రమే మారిపోయిందన్నారు. తాగునీటి సదుపాయాన్ని సైతం మెరుగుపరచినట్లు తెలిపారు.

చంద్రబాబు ఏం చేశారో చెప్పాలి

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని నేరుగా ఎదుర్కొనే ధైర్యం లేక ప్రతిపక్ష పార్టీలన్నీ అబద్ధపు ప్రచారాలను నమ్ముకున్నాయని మల్లాది విష్ణు పేర్కొన్నారు. కుప్పం వేదికగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై నారా లోకేష్ చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. ముఖ్యమంత్రిని విమర్శించే ముందు.. విద్య, వ్యవసాయ రంగాలకు చంద్రబాబు ఏం చేశారో లోకేష్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గత తెలుగుదేశం ప్రభుత్వ బకాయిల ట్రాక్ రికార్డు తమ వద్ద ఉందన్నారు. చంద్రబాబు బకాయిలు పెట్టని డిపార్టుమెంట్ లేదని విమర్శించారు. ఆయన చివరి రెండు సంవత్సరాల్లో ఫీజు రీయింబర్స్ మెంట్‌కు ఒక్క రూపాయి ఇవ్వకుండా.. పేద విద్యార్థులను చదువులకు దూరం చేశారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాగానే రూ. 1,778 కోట్ల బకాయిలను చెల్లించిందన్నారు. అన్నదాతలను సైతం చంద్రబాబు దగా చేశారన్నారు. రైతులు, విద్యార్థులు, మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఏకంగా పార్టీ మేనిఫెస్టోనే వెబ్‌సైట్ నుంచి తొలగించిన ఘనుడు చంద్రబాబు అని విమర్శించారు. తమ ప్రభుత్వం రైతుల ముంగిటకే వ్యవసాయ పథకాలను తీసుకువచ్చిందని తెలిపారు. టీడీపీ ప్రభుత్వం పెట్టిన ధాన్యం కొనుగోలు బకాయిలు రూ.990 కోట్లను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చెల్లించిందన్నారు. విద్య, వ్యవసాయ రంగాలలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు యావత్ దేశానికి ఆదర్శంగా నిలిచాయన్నారు.

మహాత్మునికి ఘన నివాళి

బాపూజీ కలలు కన్న సంపూర్ణ గ్రామ స్వరాజ్యం దిశగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాలన సాగిస్తోందని మల్లాది విష్ణు పేర్కొన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని ఆ మహనీయుని చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, డీఈలు గురునాథం, రామకృష్ణ, ఏఎంఓహెచ్ రామకోటేశ్వరరావు, సీడీఓ జగదీశ్వరి పాల్గొన్నారు.

గాంధీజీ స్ఫూర్తితో సేవలు



గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జమల పూర్ణమ్మ



గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కొల్లూరి, డాక్టర్ బ్రహ్మదేశం వసంతకుమార్

మధురానగర్(విజయవాడసెంట్రల్): జాతిపిత మహాత్మా గాంధీ స్ఫూర్తితో సేవలు అందించడంతో పాటు శాంతి, అహింస మార్గం అలవర్చుకోవాలని ఎక్స్‌రే సాంస్కృతిక సాహిత్య సేవాసంస్థ అధ్యక్షుడు కొల్లూరి, డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ బీ వసంతకుమార్ సూచించారు. ఎక్స్ రే సాంస్కృతిక సాహిత్య సేవాసంస్థ, డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం గాంధీ వర్ధంతి కార్యక్రమం జరిగింది. తొలుత గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. నాయకులు బి.ఆంజనేయ రాజు, కొండాయగుంట రాము, మండ రాము, ఎం.సత్యనారాయణ, పి.విల్సన్‌రాజు, గుర్రం ఏడు కొండలు పాల్గొన్నారు.

ఠాగూర్ గ్రంథాలయంలో..

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో మహాత్మాగాంధీ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ జమల పూర్ణమ్మ గాంధీ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి రమాదేవి, సిబ్బంది దాసి రమేష్, కె.రాంబాబు శంకర్, కుమార్ , ఫణి బాబు, దుర్గాంబ పాల్గొన్నారు.

మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేయండి

వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



స్క్రూబ్రిడ్జి వద్ద పరిస్థితిని పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): స్క్రూబ్రిడ్జి కింద తాత్కాలికంగా మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటుచేయాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన సోమవారం డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, కార్పొరేటర్ పుప్పల నరసకుమారి, అధికారులతో కలసి సర్కిల్–3 పరిధిలోని 15, 21వ డివిజన్లలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న సమస్యలు తెలుసుకుని అధికారులకు సూచనలు చేశారు. 15వ డివిజన్‌లోని వంగవీటి మోహనరంగా పార్కును పరిశీలించి లోపల షెడ్డును గ్రంథాలయంగా మార్చాలని డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ సూచించారు. దీనికి తగిన చర్యలు తీసుకోవాలని, పార్కులో గ్రీనరీని అభివృద్ధి చేయాలని ఉద్యానవన విభాగం అధికారులకు సూచించారు. అనంతరం ఆయన 21వ డివిజన్‌లోని పద్మావతి ఘాట్‌లో ఏర్పాటు చేసిన ఫెన్సింగ్ ను త్వరగా పూర్తి చేయాలని, స్థానికంగా పార్కును, గ్రీనరీని, పిల్లల ఆట పరికరాలను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. తర్వాత కృష్ణలంక శివశంకరపురం బర్మా సీతారామయ్య నగరపాలక సంస్థ ప్రత్యేక ప్రాథమిక స్కూల్‌ను పరిశీలించారు. పాఠశాల్లో పిల్లలు తక్కువగా ఉండటం గమనించిన ఆయన విద్యార్థులను వేరే స్కూలుకు మార్చి పాఠశాల భవనాన్ని అభివృద్ధి చేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజినీర్ ప్రభాకర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ బోను దుర్గానరేష్



బీసీ సంక్షేమ సంఘం యువజన విభాగం అధ్యక్ష, కార్యదర్శులకు నియామక పత్రం అందజేస్తున్న బోను దుర్గ నరేష్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించే విధంగా పార్లమెంట్ సమావేశాల్లో నిర్ణయం తీసుకోవాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ బోను దుర్గానరేష్ కోరారు. సోమవారం ప్రెస్ క్లబ్‌లో జాతీయ బీసీ సంక్షేమ సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీల సమస్యలపై ఫిబ్రవరి 8,9 తేదీలలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం పిల్ల శ్రీనివాసరావును బీసీ సంక్షేమ సంఘం యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించారు. మద్ది శ్రీనివాసరావు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు పోతిన వర ప్రసాద్, యువజన విభాగం నగర అధ్యక్షుడు పి.కిరణ్, రాష్ట్ర మహిళ వర్కింగ్ ప్రెసిడెంట్ మెండే జ్యోతి, రాష్ట్ర అధికార ప్రతినిధి పట్నాల హరిబాబు, రాష్ట్ర ప్రచార కమిటీ అధ్యక్షులు పిల్లా దినేష్, ప్రసాద్, కృష్ణ, రామకృష్ణ పాల్గొన్నారు.

29వ డివిజన్లో సమస్యల పరిష్కారం

మధురానగర్(విజయవాడసెంట్రల్): 29వ డివిజన్ మధురానగర్‌లో ఇటీవల నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణుకు డివిజన్ వాసుల తరఫున 29వ డివిజన్ కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి సోమవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. గడప గడపకూ మన ప్రభుత్వం పాదయాత్రలో పలువురికి సత్వరమే సర్టిఫికెట్లు అందజేశారని ప్రజల విజ్ఞప్తి మేరకు డివిజన్‌లో గుంతలు, ఆర్‌యూబీ వద్ద రోడ్డు పనులకు అవసరమైన ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారని పేర్కొన్నారు. ప్రతిపాదనలకు అనుగుణంగా రూ.3.43లక్షలను మంజూరు చేయించి, పనులు ప్రారంభించారని తెలిపారు.

ప్రత్యేక హోదాపై మోసం చేసిన వారికిబుద్ధి చెప్పండి

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని మోసం చేసిన వారికి బుద్ధి చెప్పాలని ప్రత్యేక హోదా సాధన సమితి, విద్యార్థి యువజన సంఘాలు పిలుపునిచ్చాయి. ప్రత్యేక హోదా విభజన హామీలు అమలు చేయాలని కోరుతూ అనంతపురం నుంచి ఇచ్చాపురం వరకు చేపట్టిన సమరయాత్ర సోమవారం నగరానికి చేరింది. యాత్ర బస్సుకు బెంజిసర్కిల్ వద్ద ప్రజా సంఘాల నాయకులు, వామపక్ష నేతలు, ప్రత్యేక హోదా సాధన సమితి నాయకులు స్వాగతం పలికారు. అనంతరం గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో ఎస్ఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు ఎం.సోమేశ్వరరావు అధ్యక్షత సభ నిర్వహించారు.

కుష్ఠు నివారణపై ప్రచారం



పాయకాపురం(విజయవాడరూరల్): కుష్ఠుని మల్టీ డ్రగ్ ట్రీట్‌మెంట్ ద్వారా పూర్తిగా నివారించుకోవచ్చని 62వ డివిజన్ కార్పొరేటర్ అలంపూరు విజయలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం ప్రకాష్‌నగర్‌లో డాక్టర్ వైఎస్సార్ అర్బన్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం నుంచి కుష్ఠు నివారణ అవగాహన ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజు మాట్లాడుతూ స్పర్శలేని చర్మం, మెరుస్తూవుండే చర్మం, వెంట్రుకలు లేకుండా వుండే దాని వలన కుష్ఠును గుర్తించవచ్చన్నారు.

డైరీ ఆవిష్కరణ



విజయవాడ స్పోర్ట్స్: రవాణా శాఖ ఉద్యోగుల సంఘం జోన్–2 డైరీని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఎం.పురేంద్ర డీటీసీ కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ డైరీలో పొందుపర్చిన ప్రభుత్వ జీఓలు, సర్కులర్లు ఉద్యోగులకు ఎంతగానో ఉపయోగపడతాయని ఈ సందర్భంగా పురేంద్ర తెలిపారు. రవాణ శాఖ ఉద్యోగుల సంక్షేమాన్ని కాంక్షిస్తూ ఈ డైరీని రూపొందించామని ఉద్యోగుల సంఘం జోనల్ అధ్యక్షుడు ఎం.రాజబాబు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్టీఓలు ఆర్.జగదీశ్వర రాజు, ఆర్.ప్రవీణ్, ట్రైనీ ఆర్టీఓలు సునీల్, చందన, మనీషా, సంఘ ప్రతినిధులు వెంకటేశ్వరరావు, నాగమురళి, ఉషాసుందరి పాల్గొన్నారు.

రేపు విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణ పోటీలు



పోటీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాఘమాసం సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యాన వచ్చేనెల ఒకటో తేదీన నిర్వహించతలపెట్టిన విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణ, అచ్యుతాష్టకం పోటీల పోస్టర్లను సోమవారం ఏపీ ఫైబర్‌నెట్ చైర్మన్, ముత్యాలంపాడు షిరిడీసాయిబాబా మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామికి ప్రీతికరమైన మాఘమాసంలో ముత్యాలంపాడు శ్రీషిరిడీ సాయిబాబా మందిరంలో పోటీలను ఏర్పాటు చేయటం అభినందనీయం అన్నారు. విద్యార్థుల్లో మేధో సంపత్తిని పెంపొందింపజేయడం కోసం పోటీలు దోహదపడతాయన్నారు. జిల్లా ప్రోగ్రామ్ ఇన్‌చార్జి సీవీకే ప్రసాద్ మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానం మాఘమాసాన్ని పురస్కరించుకుని విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణ స్తోత్రం 108 శ్లోకాలు 15 సంవత్సరాలలోపు చిన్నారులకు, అచ్యుతాష్టకం తొమ్మిది శ్లోకాలలో 10 సంవత్సరాల్లోపు చిన్నారులకు విడివిడిగా పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. బుధవారం ఉదయం 9:30 నిమిషాలకు స్థానికంగా ఉన్న ముత్యాలంపాడు షిరిడీ సాయిబాబా మందిరంలో పోటీలు నిర్వహించి, రెండు విభాగాల్లో ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ధర్మ ప్రచార మండల సభ్యులు తాండవ కృష్ణ పాల్గొన్నారు.

కరాటే పోటీలకు ధన్యత, మహత్రు ఎంపిక

విజయవాడ స్పోర్ట్స్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించే 66వ జాతీయ కరాటే పోటీలకు విజయవాడ క్రీడాకారులు పి.ధన్యత, వై.మహత్రు ఎంపికయ్యారు. ఇటీవల ఒంగోలులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అండర్–17 బాలికల పోటీలకు ధన్యత, అండర్–19 బాలుర పోటీలకు మహత్రు ఉమ్మడి కృష్ణాజిలా నుంచి ప్రాతినిధ్యం వహించారు. ఈ పోటీల్లో ఇద్దరు క్రీడాకారులు బంగారు పతకం సాధించడంతో పాటు ఆ తరువాత నిర్వహించిన రాష్ట్ర జట్ల ఎంపిక పోటీల్లో అత్యుత్తమ క్రీడా నైపుణ్యం ప్రదర్శించి, జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. ధన్యత నారాయణ వాగ్దేవి కాలేజీలో ఇంటర్ చదువుతుండగా, మహత్రు ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో 11వ తరగతి చదువుతున్నాడు. రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు సాధించి జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను కోచ్ జె.ఎం.దాస్, ఇన్‌స్ట్రక్టర్లు సతీష్, ఆరీఫ్, రవి ఐకాన్ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్ అభినందించారు.

నేడు అన్నదానం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు ప్రభుత్వ ముద్రణాలయం సమీపంలోని రావిచెట్టు సెంటర్‌లో మంగళవారం హెల్పింగ్ టుగెదర్ 2009 గ్రూప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మధ్యాహ్నం 12 గంటలకు అన్న ప్రసాద వితరణ చేయనున్నట్లు ట్రస్ట్ సభ్యులు షేక్ షఫీవుల్లా, మల్లిక సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాము సామాజిక బాధ్యతగా చేపట్టిన అన్నదానం కార్యక్రమంలో ప్రతిఒక్కరూ పాల్గొనాలని వారు కోరారు.

ఆర్చరీలో సత్తాచాటిన డివిజన్ ఉద్యోగులు



ఆర్చరీలో బంగారు, కాంస్య పతకాలు సాధించిన చరణ్‌రెడ్డి, సునేందురాయ్

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ఆల్ ఇండియా రైల్వే ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో విజయవాడ డివిజన్ ఉద్యోగులు ఒక బంగారు, రెండు కాంస్య పతకాలు సాధించారు. ఈ నెల 29 నుంచి 31వ తేదీ వరకు చిత్తరాజన్‌లో జరుగుతున్న 12వ ఆల్ ఇండియా రైల్వే ఆర్చరరీ చాంపియన్‌షిప్‌లో కమర్షియల్ విభాగంలో ఆఫీస్ సూపరింటెండెంట్ వై.చరణ్‌రెడ్డి, ఎస్ అండ్ టి విభాగంలో హెల్పర్ సునేందురాయ్‌లు దక్షిణ మధ్య రైల్వే ఆర్చరీ టీంకు ప్రాతినిధ్యం వహించారు. ఈ ఈవెంట్‌లో అద్భుతమైన ప్రదర్శనతో చరణ్‌రెడ్డి ర్యాంకింగ్ రౌండ్‌లో బంగారు పతకం సాధించగా, ర్యాంకింగ్, ఎలిమినేషన్ (ఒలింపిక్) రౌండ్‌లో సురేందురాయ్ రెండు కాంస్య పతకాలు సాధించారు. ఈ మేరకు డీఆర్ఎం షివేంద్రమోహన్, ఏడీఆర్ఎంలు ఎం.శ్రీకాంత్, డి.శ్రీనివాసరావు, డివిజనల్ స్పోర్ట్స్ ఆఫీసర్, సీనియర్ డీఎస్‌సీ వల్లేశ్వర బిటి, సీనియర్ డీపీఓ ముత్యాల బాలమురళీధర్ విజేతలకు అభినందనలు తెలియజేశారు.

సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న తోట శ్రీనివాస్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): టైలర్లు, నాయీ బ్రాహ్మణ, రజక వృత్తిదారులకు జగనన్న చేదోడు పథకం అమలు చేయడంపై వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి తోట శ్రీనివాసరావు ధన్యవాదాలు తెలిపారు. గవర్నర్‌పేటలోని ఆయన కార్యాలయంలో పథకం లబ్ధిదారులతో కలిసి వైఎస్ జగన్ చిత్రపటానికి సోమవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా తోట శ్రీనివాస్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుల, మత, ప్రాంతాలు, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ పథకాలు అందజేస్తున్నారు. లంచాలకు ఆస్కారం లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే నగదు జమచేయడం దేశంలో మరెక్కడా లేదన్నారు. పైరవీలకు తావు లేకుండా పథకాలు ఇస్తున్నారన్నారు. కరోనా వంటి విపత్తులు ఎదురైనా సంక్షేమ పథకాలు ఆపకుండా అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణులు లక్ష్మణ్, రాజు వైఎస్సార్ సీపీ నాయకులు దాసం దుర్గారావు, నక్క సుబ్బారెడ్డి, బల్లం కిషోర్ ,అన్నపరెడ్డి రామిరెడ్డి పాల్గొన్నారు.

తెలుగు సినీరంగ ధృవతార జమున



సినీ నటి జమున సంతాప సభలో పాల్గొన్న గాయకులు

విజయవాడ కల్చరల్: తెలుగు సినీ రంగ ధృవతార సినీ నటి జమున అని విద్యావేత్త నిడుమోలు రమాసత్యనారాయణ అన్నారు. మహానటి సావిత్రి కళాపీఠం ఆధ్వర్యంలో గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదికమీద సోమవారం జమున సంతాప సభ, సినీ స్వరనీరాజనం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ తెలుగు సినీ రంగ చరిత్రలో ఆమె అనేక విజయవంతమైన చిత్రాలలో నటించినట్లు తెలిపారు. అగ్ర సినీ నటులతో కలసి నటించారన్నారు. కళాపీఠం వ్యవస్థాపకురాలు పరచూరి విజయలక్ష్మి మాట్లాడుతూ ఆమె నాటక అకాడమీ చైర్మన్‌గా ఆమె కళాకారుల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపట్టారన్నారు. గుంటూరు జిల్లా దుగ్గిరాలలో ప్రారంభమైన ఆమె సినీ రంగ ప్రస్థానం విజయవంతంగా ముగిసిందన్నారు. బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు కొప్పరపు బలరామకృష్ణ మూర్తి మాట్లాడుతూ నగరంతో ఆమెకు విడదీయలేని అనుబంధం ఉందన్నారు. మద్రాస్‌నుంచి సినీరంగాన్ని హైదరాబాద్‌కు రావడంలో కృషి చేసినట్లు తెలిపారు. విజయలక్ష్మి ఆధ్వర్యంలో గాయకులు ఉమాబలరాం, వీ కామేశ్వరి, సుధారాణి, విష్ణు ప్రియ, డేవిడ్ రాజు జమున నటించిన చిత్రాలలోని పాటలను ఆలపించారు. కళాకారులు గాయనీ గాయకులు, నిర్వాహకులు జమున చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించారు.

నేత్ర పర్వంగా కూచిపూడి నృత్యాలు

జయవాడ కల్చరల్: త్రిపుర కల్చరల్ ఆర్ట్స్, తిరుమల తిరుపతి దేవస్థానం, అన్నమాచార్య పరివారం ఆధ్వర్యంలో భీష్మ ఏకాదశి సందర్భంగా సత్యనారాయణపురంలోని సీతారామా కల్యాణ మండంలో సోమవారం ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు మనోహరంగా సాగాయి. అరుణోదయ కళాసమితి నృత్య కేంద్రం నిర్వాహకురాలు పక్కి మంజూష బృందం కూచిపూడి సంప్రదాయంలో పలు అంశాలను ప్రదర్శించింది. తాండవ నృత్యకరి గజానన, వినరో భాగ్యము విష్ణుకథ, అన్నమయ్య సంకీర్తనలు, జతి స్వరం తదితర అంశాలను ప్రదర్శించారు. హరి కథాగానంలో భాగంగా బుర్రాపద్మనాభశర్మ, సుందరాకాండ, మొగలిచర్ల నాగమణి, భాగవతారిణి భీష్మ ప్రతిజ్ఞ, పురాణం విజయలక్ష్మి భాగవతారిణి సుగ్రీవ మైత్రి కథలను గానం చేశారు. నిర్వాహకుడు పాణ్యం దక్షిణామూర్తి మాట్లాడుతూ సాంస్కృతిక, కళారంగాలకు భావి తరాలకు అందించేలా కార్యక్రమాలు నిర్వహిస్తునట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం హరికథలను ప్రోత్సహిస్తూ కోట సచ్చిదానంద శాస్త్రికి పద్మశ్రీ పురస్కారం ప్రదానం చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి దేవాలయంలో హరికథా గానం ఏర్పాటు చేయాలని హరికథా పీఠం ఏర్పాటు చేయాలని సూచించారు.